

పోడు భూములు పచ్చగా..

పోడు భూములను ఉద్యాన వనాలుగా మార్చేందుకు ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రూపొందించింది. 8లో



దాడులు నిలిపివేయాలి

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 36° / 24°

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం కొన్ని చోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

ఇది వైరా మండలం స్టేజీ పినపాక - ఏపీలోని నెమలి వెళ్లే ప్రధాన రహదారి. ఇటీవల కురిసిన వర్షాలతో ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.



ఇది వైరా - జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారి. ఈ రోడ్డుపై కూడా పలు చోట్ల గుంతలు పడ్డాయి. కొత్తవారు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతున్నారు.



సాక్షి ఫోకస్

ప్రయాణం.. ప్రాణ సంకటం

గుంతలమయంగా మారిన రహదారులు

- జిల్లాలో పలుచోట్ల దెబ్బతిన్న రోడ్లు..
- గతేడాది భారీ వర్షాలకు ధ్వంసమైన వైనం
- మరమ్మతులు చేపట్టక వాహనదారుల ఇక్కట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. భారీ గుంతలతో ఉన్న రహదారులు వాహనదారులను భయపెడుతున్నాయి. ఏడాదిగా రోడ్లన్నీ ఈ దుస్థితిలోనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆయా శాఖల పరిధిలో ప్రతిపాదనలు పంపడం, నిధులు మంజూరయ్యాయని చెప్పడానికే పరిమితమయ్యారు తప్పితే.. కొత్త రహదారుల మాట అటుంచి కనీసం గుంతలు పూడ్చడం, మరమ్మతులు చేయడం కూడా మర్చిపోయారనే విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో పాటు పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతేడాది తుపానుతో జిల్లాలోని పలు రహదారులు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



తారు లేచిపోయి అధ్వానంగా మారిన తల్లాడ సెంటర్‌లోని రింగ్ రోడ్డు

అధ్వానం.. అసౌకర్యం..

జిల్లాలోని రహదారులన్నీ గుంతలమయంగా మారాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రహదారులు గత ఏడాది వచ్చిన భారీ వర్షాలకు మరింతగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల దుస్థితి అధ్వానంగా ఉంది. అలాగే వైరా - జగ్గయ్యపేట రాష్ట్రీయ రహదారిపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో నీరు నిల్వడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వైరా మండలం స్టేజీ పినపాక నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా నెమలికి వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. రోడ్డు మధ్యలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పైగా పలుచోట్ల కంకర తేలి గుంతల్లో నీరు నిలిచింది. ఆ రోడ్డుపై వాహదారులు వేగంగా వస్తే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే. వైరా - కొణిజర్ల, కొణిజర్ల మండలంలోని పలు రహదారుల పరిస్థితీ ఇలాగే ఉంది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి.

ప్రయాణం.. ప్రమాదమే..

భారీ గుంతలు పడిన రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులపై కొత్తగా ప్రయాణించేవారు వీటిపై అవగాహన లేక ప్రమాదాల బారిన పడిన ఘటనలు కూడా ఉన్నాయి. వైరా - జగ్గయ్యపేట రహదారిపై ఇలా పలు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కూడా కోల్పోయారు. కనీసం గుంతలు పూడ్చడంపై అయినా అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాలకు దెబ్బతిని..

తల్లాడ - కొత్తగూడెం, తల్లాడ - సత్తుపల్లి ఆర్అండ్‌బీ రోడ్లు పలుచోట్ల గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా తల్లాడ - లక్ష్మీనగర్, బిల్లుపాడు - అంజనాపురం, మల్సూర్‌తండా వద్ద రోడ్లు పాడయ్యాయి. తారు కొట్టుకుపోయింది. తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో పరిస్థితి అధ్వానంగా ఉంది. అన్నారుగూడెం - నరసింహారావుపేట వద్ద కూడా రోడ్డు అక్కడక్కడా దెబ్బతిన్నది. రోడ్లు ఇలా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల వెళ్లే వాహనాలన్నీ ఈ రోడ్డుపైనే వస్తుంటాయి. ఇప్పటికైనా ఈ రోడ్డు మరమ్మతులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

దెబ్బతిన్న పల్లిపాడు – ఏన్కూరు రహదారి..

కొణిజర్ల మండలం పల్లిపాడు – ఏన్కూరు మధ్య రహదారి దెబ్బతిన్నది. ఖమ్మం నుంచి కొత్తగూడెం, భద్రాచలం వెళ్లేందుకు కొంత దూరం తగ్గేందుకు పలువురు ఈ రోడ్డుపై నుంచే వెళ్తుంటారు. దీంతో 2018లో అప్పటి ప్రభుత్వం దీన్ని డబుల్ రోడ్డుగా మార్చింది. ఇప్పుడు వర్షం పడితే రోడ్డంతా గుంతలమయం అవుతోంది. తీగల బంజర సమీపంలో పగిడేరు ప్రవహిస్తే రోడ్డు దాదాపు 100 మీటర్ల మేర కొట్టుకుపోతోంది. అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తున్నారు. ఈ రోడ్డుపై దాదాపు మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తీగలబంజరకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో సహా గుంతలో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. పల్లిపాడు నుంచి అంజనాపురం వరకు, ఆ తర్వాత జన్నారం నుంచి ఏన్కూరు వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

పేదలందరికీ గూడు కల్పిస్తాం



కమలాపురంలో గోదాంల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ అనుదీప్ తదితరులు

- రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- 95 లక్షల రేషన్ కార్డులు, 51 లక్షల కుటుంబాలకు 'గృహజ్యోతి'
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- కమలాపురంలో గోదాం నిర్మాణానికి భూమి పూజ

ముదిగొండ : ప్రతీ పేదవాడికి గూడు నిర్మించే సంకల్పంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మండలంలోని కమలాపురంలో రూ.10 కోట్లతో నిర్మించే 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో సాగునీటి సరఫరా, రుణమాఫీ, రైతు భరోసా వంటి కార్యక్రమాల అమలుతో దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. సీతారామ ప్రాజెక్టుతో జిల్లా భూములు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి నీరు తెచ్చేలా చేసిన డిజైన్‌ను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులతో ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తే నీటికి ఇబ్బంది ఉండేది కాదన్నారు. రాజకీయ విమర్శలకు తావు లేకుండా బనకచర్ల ప్రాజెక్టును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని అన్నారు. రాష్ట్రంలో 95 లక్షల పేద కుటుంబాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలు ఒకే చోట చదువుకునేలా 104 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నామని వివరించారు. మహిళా సంఘాలకు రూ.21వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పెంచుతామని చెప్పారు. కమలాపురంలో చేపట్టిన గోదాముల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గోదాముల నిర్మాణం పూర్తయితే రైతులు పండించే వరి, ఇతర పంటల నిల్వలకు ఇబ్బంది ఉండదని అన్నారు. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్‌తో వరి ఉత్పత్తి పెరుగుతోందని చెప్పారు. అనంతరం పెదమండవ ఎస్సీ కాలనీలో రూ.58.50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భట్టి శంకుస్థాపన చేశారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతి బోర్డును ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎండీ లక్ష్మి, హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సీపీ సునీల్‌దత్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ కళావతి బాయి, డీఎంఓ ఎంఏ. అబ్దుల్ అలీమ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మందరపు నాగేశ్వరరావు, వనం నర్సింగరావు, వల్లూరి భద్రారెడ్డి, వనం ప్రదీప్త చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

జమలాపురంలో పవిత్రోత్సవాలు ప్రారంభం



పవిత్రలకు పూజలు చేస్తున్న అర్చకులు, అధికారులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 – 15 గంటలకు శ్రీ స్వామివారి యాగశాలలో అర్చకులు పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. శ్రీ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్కరణం, మండపారాధన నిర్వహించారు. శ్రీవారి పాదానికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రధాన కలశ స్థాపన, అగ్నిమథనం, హోమం నిర్వహించి పవిత్ర మాలలకు పుష్పాధివాసం,. ధాన్యాధివాసం, శయ్యాధివాసం నిర్వహించారు. అనంతరం మహా నివేదన, నీరాజన మంత్రపుష్పం పఠించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాశాఖకు దిక్కెవరు..?

- ఏళ్లుగా భర్తీ కాని డీఈఓ పోస్టు
- ఇన్‌చార్జ్‌లతో పాలన అంతంతమాత్రమే..
- రెగ్యులర్ అధికారిని నియమించాలంటున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్ : అత్యంత కీలకమైన ప్రభుత్వ శాఖల్లో విద్యా శాఖ ఒకటి. అంతటి ప్రాధాన్యత గల శాఖకు జిల్లాలో సుమారు మూడేళ్లుగా రెగ్యులర్ డీఈఓ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల కాలం వరకు డైట్ ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా.. ఆయన రెండు బాధ్యతలు నిర్వహించాల్సి రావడంతో దేనిపైనా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోయారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలోని పాఠశాలలపై పర్యవేక్షణ, అధికారులతో సమావేశాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధ్యాయుల సర్దుబాటు, మంత్రులు, ఇతర అధికారుల కార్యక్రమాలకు డీఈఓ హాజరు కావాల్సి ఉంటుంది. వీటితో పాటు నిత్యం పాఠశాలలు, ఉపాధ్యాయులపై పర్యవేక్షణ చేయాలి. అలాంటి కీలక పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉంది.

గతంలో అలా..

డైట్ లెక్చరర్‌గా ఉన్న సోమశేఖర శర్మను ఎఫ్ఏసీ డీఈఓగా నియమించగా ఆయన పనిచేసిన సుమారు రెండేళ్ల కాలంలోనూ అనేక ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రధానంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు సైతం వినిపించాయి. ఆయన డీఈఓగా ఉన్న సమయంలో అనర్హులకు ఉద్యోగాలు ఇవ్వగా దానిపై విచారణ అనంతరం వారిని ఉద్యోగం నుంచి తొలగించారు.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

ప్రస్తుతం ఇలా..

డైట్ ప్రిన్సిపాల్‌గా ఉన్న సత్యనారాయణ సుమారు మూడు నెలల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు శిక్షణ సమయంలో ప్రభుత్వం నిధులు కేటాయించగా, వాటిలో కొన్ని దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. తాజాగా ఆయన ఉద్యోగ విరమణ పొందిన తర్వాత రోజు కూడా ఆయన పెండింగ్ ఫైళ్లపై సంతకాలు చేశారని కార్యాలయ సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు. ఉద్యోగ విరమణకు ముందు కూడా పలు కీలక అంశాల్లో సంతకాలు చేశారనే విమర్శలు సైతం వస్తున్నాయి. వీటిపై సమగ్ర విచారణ చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే..

జిల్లా విద్యాశాఖకు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇతరులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే వారిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఇష్టారీతిన విధులు నిర్వహించారనే ఆరోపణలు వస్తున్నాయి. తప్పిదాలు వెలుగుచూశాక తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంతో ఇతర అధికారులు కూడా అదే ఒరవడి కొనసాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి రెగ్యులర్ డీఈఓను నియమిస్తే పాలన గాడిన పడే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓకు బాధ్యతలపై అసంతృప్తి..

ఇన్‌చార్జ్ డీఈఓగా ఉన్న సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందగా తాత్కాలికంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓతో ఆ పోస్టు భర్తీ చేయాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తున్న సమయంలో పూర్తిస్థాయి డీఈఓ లేకుంటే ఎలా అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖపై పూర్తిస్థాయిలో అవగాహన లేని వారికి డీఈఓ పోస్టు ఎలా ఇస్తారని అంటున్నారు.

వెల్లువెత్తుతున్న ఆరోపణలు..

జిల్లాలో విద్యాశాఖ పనితీరుపై ప్రతీ ఏడాది తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అయినప్పటికీ అధికార యంత్రాంగంలో మార్పు రాకపోవడం గమనార్హం. కీలక అధికారి పోస్టుకు ఇన్‌చార్జ్‌గా నియమితులైన అధికారి చేసే కార్యకలాపాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించలేదు. సుమారు నాలుగేళ్లుగా విద్యాశాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉన్న నేపథ్యంలో డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్, ప్రిన్సిపాల్ ఎఫ్ఏసీ డీఈఓగా విధులు నిర్వహించారు. వీరిద్దరి పనితీరుపై పలు ఆరోపణలు వస్తుండడం విమర్శలకు బలం చేకూరుస్తోంది.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఎనిమిది బృందాలతో వెరిఫికేషన్

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) నుంచి గ్రేడ్–2 హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఎస్ఏ, గ్రేడ్–2 హెచ్ఎంలకు సంబంధించిన ఖాళీలను ప్రకటించడంతో పాటు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులైన వారి జాబితాను సైతం వెల్లడించారు. దీంతో ఆది, సోమవారాల్లో డీఈఓ కార్యాలయ సిబ్బంది అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. అలాగే సోమవారం నుంచి సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సీనియారిటీ జాబితాపై 25 మంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దరఖాస్తులు సమర్పించారు. అందులో పేర్లు లేనివి 9 ఉండగా.. మిగతావి కరెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎస్ఏ ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హెచ్ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు ఇప్పటికే అర్హులైన వారి జాబితా ప్రకటించగా.. వారి సర్టిఫికెట్లను సోమ, మంగళవారాల్లో పరిశీలించనున్నారు. ఇందుకోసం ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశారు.



డీఈఓ కార్యాలయంలో అభ్యంతరాలు స్వీకరిస్తున్న సిబ్బంది

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒక్కరోజు ఆదాయం రూ.56,170

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కిన్నెరసాని ప్రాజెక్ట్, డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ప్రకృతి అందాల నడుమ ఆహ్లాదం పొందారు. 489 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.25,770 ఆదాయం లభించగా, 320 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,010 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



కిన్నెరసాని జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

ఉద్యోగుల పక్షాన నిలబడతాం..

టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంరూరల్: ఏదులాపురం కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల పక్షాన నిలబడతామని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం శాయశక్తులా కృషి చేస్తామని టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈజేఏసీ జనరల్ సెక్రటరి ఏలూరి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మండలంలోని సత్యనారాయణపురంలో గల టీసీవీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఏదులాపురం ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో చాలాకాలనీలు ఉన్నాయని, అవన్నీ గత పాలకుల కాలంలో నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. ప్రస్తుతం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 40 వరకు వెంచర్లు ఉన్నాయని, వాటిలో ఉన్న వారంతా కమిటీగా ఏర్పడటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సమస్య ఉంటే తనను నేరుగా కలవొచ్చని చెప్పారు. కార్యక్రమంలో భైరు హరినాథ్‌బాబు, విజయ్, పెరుమాళ్లపల్లి శ్రీనివాసులు, కె.సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, జయపాల్, బి.శోభన్, టి.శ్రీనివాస్, కిషన్‌నాయక్, డి.నాగమణి, శ్రీదేవి, మద్ది పుల్లయ్య, సాయిబాబా, జి.మల్లికార్జున్, రామయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని రాజీవ్‌గృహకల్పలో జరిగిన సమావేశంలోనూ ఏలూరి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో గుంటుపల్లి శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, వెంకన్న, లలిత కుమారి, టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉద్యోగులు

ఆస్పత్రుల అభివృద్ధిపై సర్కారు దృష్టి

ఆర్టీఐ కమిషనర్ పి.వి.శ్రీనివాస్

తిరుమలాయపాలెం: గ్రామీణ, పట్టణ ప్రాంత ఆస్పత్రుల అభివృద్ధితో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.వి.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన తిరుమలాయపాలెం సీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు విధిగా చేయాలని, తక్షణమే వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వెళ్లేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. డెంగీ వంటి సీజనల్ జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని చంద్రుతండా, అజ్మీరతండా గ్రామాల్లో ఇప్పటికే డెంగీ కేసులు నమోదయ్యాయని, ఇకపై కేసులు పెరగకుండా అదుపు చేయాలని అన్నారు. సిబ్బంది స్థానికంగా ఉండాలన్నారు. సీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, డెలివరీ గది, వార్డు, ఫార్మసీ, రక్త నమూనాలు సేకరించే ల్యాబ్‌ను పరిశీలించారు. సిటిజన్ చార్ట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందూనాయక్, వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, కృపాఉషశ్రీ, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, కమ్మకోమటి నాగేశ్వరరావు, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పి.వి.శ్రీనివాస్

క్లుప్తంగా

ముగిసిన సౌత్ ఇండియా కరాటే టోర్నీ



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న శ్రీకాంత్

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని ఎండీ గార్డెన్స్‌లో జరుగుతున్న దక్షిణభారత కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలను విన్‌ఫీల్డ్ పాఠశాల డైరెక్టర్ పి.శ్రీకాంత్ ప్రారంభించారు. దాదాపు 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొనగా.. విజేతలకు నిర్వాహకులు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు కె.సందేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల్లో రాజకీయ చైతన్యం రావాలి



మాట్లాడుతున్న చందర్‌రావు

నేలకొండపల్లి: ఆర్యవైశ్యుల్లో రాజకీయ చైత న్యం రావాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు ఆకాంక్షించారు. స్థానిక వాసవీభవన్‌లో పాలేరు నియోజకవర్గ ఆర్యవైశ్య రాజకీయ చైతన్య సదస్సు ఆదివారం నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్యులు స్థానిక సంస్థల ఎన్నికల నుంచి అన్నింట్లోనూ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల కోసం పనిచేస్తూ బలం పెంచుకోవాలని చెప్పా రు. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎవరి నైనా ఎదిరించే శక్తిని సాధించాలని పేర్కొన్నా రు. సమావేశంలో మాటూరి సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, నాగుబండి శ్రీనివాసరావు, నరసింహమూర్తి, పి.వెంకటేశ్వర్లు, సీతారామా రావు, హనుమంతరావు, దోసపాటి శేఖర్, గెల్లా జగన్‌మోహన్‌రావు, కనమర్లపూడి రమేశ్, కొత్తా రమేశ్, వంగవీటి నాగేశ్వరరావు, వందనపు నాగేశ్వరరావు, బోనగిరి కిరణ్, కొత్తా రాణి, తెల్లాకుల జయశ్రీ, మైలవరపు సంతోష్, రాయపూడి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'లకారం'పైకి సందర్శకులు రాకుండా అడ్డగింత



బారికేడ్ల వద్దనే ఆగిపోయిన సందర్శకులు

ఖమ్మంమయూరిసెంటర్: సెలవుదినం ఆదివారం రోజు పిల్లలతో సేదదీరేందుకు లకారం ట్యాంక్‌బండ్‌కు మధ్యాహ్నం 12 గంటల సమయంలో వచ్చిన సందర్శకులను ఓ యువకుడు లోనికి అనుమతించకుండా అడ్డుకునే ప్రయ త్నం చేశాడు. ట్యాంక్‌బండ్‌పై గంజాయి తాగే వాళ్లు ఉన్నారు.. లోపలకి రాకూడదు అంటూ హల్‌చల్ చేశాడు. దీంతో అక్కడికి వచ్చిన వారు నివ్వెరపోతూ బారికేడ్ల వద్ద ఆగిపోయారు. కొందరిని మాత్రం లోపలకు అనుమతిస్తూ, కొందరిని అడ్డుకోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో సందర్శకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోడు భూములు పచ్చగా..

- 'ఇందిరా సౌర గిరి జలవికాసం'ద్వారా అభివృద్ధికి ప్రణాళిక
- నీటి పారుదలకు సోలార్ పంపుసెట్ల మంజూరు
- ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 73,733 మంది రైతులకు లబ్ధి
- 2.23 లక్షల ఎకరాల మేర సాగుకు ప్రయోజనం





ఖమ్మంవ్యవసాయం: పోడు భూముల(ఆర్‌ఓఎఫ్‌ఆర్)ను ఉద్యాన వనాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా సౌర గిరి జల వికాసం'పథకాన్ని రూపొందించింది. ఆర్‌ఓఎఫ్‌ఆర్ (రికగ్నైజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) భూములు గిరిజన ప్రాంతంలో ఉండటం, ఆయా భూములను గిరిజనులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుండటంతో 2006లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హక్కులు కల్పించారు. గిరిజనులు ఆ భూముల్లో వర్షాధారంగా మెట్ట పంటలను సాగు చేస్తున్నారు. సారవంతమైన ఈ భూములను అభివృద్ధి చేసేందుకు ఐదేళ్ల ప్రణాళికతో ఈ పథకానికి రూపకల్పన చేసి, అమలు బాధ్యత గిరిజనాభివృద్ధి సంస్థకు అప్పగించింది. రాష్ట్రంలో 2,30,735 మంది గిరిజన రైతులకు చెందిన 6.69 లక్షల ఎకరాల భూమిని రూ.12,600 కోట్లతో అభివృద్ధి చేసి, ఉద్యాన వనాలను పెంచా లని నిర్ణయించింది. రాష్ట్రంలోని 17జిల్లాల్లో ఉన్న పోడు భూముల అభివృద్ధికి ఈ పథకాన్ని వర్తింప జేసే విధంగా ప్రణాళిక రూపొందించారు. 2025–26 నుంచి 2029–30 వరకు అమలు చేయనున్న ఈ పథకంలో తొలి ఏడాది ప్రయోగాత్మకంగా తక్కువ మంది రైతులు, తక్కువ విస్తీర్ణంలో.. తరువాత నాలుగేళ్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోనున్నారు. తొలి ఏడాది 10వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాల్లో పథకాన్ని అమలు చేసే విధంగా రూ.600 కోట్లతో అంచనాలు రూపొందించారు.

తిరిగి పచ్చదనం

పూర్వం దట్టమైన అడవులతో ఉన్న భూములను ఆయా ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు జీవనోపాధి కోసం సాగు భూములుగా మార్చుకున్నారు. దీంతో అడవులు క్రమంగా అంతరించి, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఈ పథకంలో భాగంగా పోడు భూముల అభివృద్ధి, ఉద్యాన పంటల సాగును చేపట్టనుండటంతో గిరిజనుల జీవనోపాధి మెరుగుపర్చడమే కాకుండా తిరిగి ఆ భూములు అడవులను తలపిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రోత్సాహకాలు అందించి ఆయిల్ పామ్, మామిడి, జామ, సపోట వంటి తోటలను పండించేలా చర్యలు చేపడుతున్నారు.

సోలార్ పంపుసెట్ల మంజూరుకు ప్రణాళిక

పథకంలో భాగంగా నీటి సౌకర్యం రెండున్నర ఎకరాలను ఒక యూనిట్‌గా తీసుకుని, వంద శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్‌ను అందిస్తారు. ఒక యూనిట్‌కు రూ.6 లక్షల వ్యయంతో 200 అడుగుల లోతు బోరుగుంత తీసి, కేసింగ్ వేసి, పంపుసెట్ ఏర్పాటు చేస్తారు. సోలార్ పలకలు అమర్చి, ఇన్వర్టర్ ఏర్పాటు, పంపుసెట్, సోలార్ పలకల చుట్టూ ఫెన్సింగ్ వంటి నిర్మాణాలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఎంపిక చేసిన కంపెనీలు ఐదేళ్ల పాటు నిర్వహిస్తాయి. ఐదేళ్ల కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 73,733 మంది రైతులకు చెందిన 2.23 లక్షల ఎకరాలకు అమలు చేయనున్నారు. ఖమ్మం జిల్లాలో 11,386 మంది రైతులకు చెందిన 27,448 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 62,347 మంది రైతులకు చెందిన 1,95,998 ఎకరాల పోడు భూముల్లో పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ ఏడాది మాత్రం ఖమ్మం జిల్లాలో 550 మంది రైతులకు చెందిన 1,516 ఎకరాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,923 మంది రైతులకు చెందిన 8,046 ఎకరాల్లో అమలు చేయాలని నిర్ణయించారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఐదేళ్ల పాటు 'ఇందిరా సౌర గిరి జలవికాసం'ప్రణాళిక

	ఖమ్మం జిల్లా		భద్రాద్రి కొత్తగూడెం జిల్లా	
సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఎకరాలు	లబ్ధిదారుల సంఖ్య	ఎకరాలు
2025-26	550	1,516	2,923	8,046
2026-27	2,809	6,483	14,856	46,988
2027-28	2,809	6,483	14,856	46,988
2028-29	2,809	6,483	14,856	46,988
2029-30	2,809	6,483	14,856	46,988
మొత్తం	11,786	27,448	62,347	1,95,988

మార్గదర్శకాలు అందాల్సి ఉంది..



ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలులో భాగంగా సోలార్ పంపుసెట్ల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి మార్గ దర్శకాలు అందాల్సి ఉంది. వాటి ఆధారంగా ఎంపిక చేసిన లబ్ధిదారుల పోడు భూముల్లో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. పలు కంపెనీల ద్వారా సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

–పి. అజయ్‌కుమార్, రెడ్‌కో మేనేజర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా

ఇజ్రాయిల్.. దాడులు నిలిపివేయాలి

- 7న పాలస్తీనా సంఘీభావ ర్యాలీకి సీపీఎం మద్దతు
- పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్లుగా ఇజ్రాయిల్.. పాలస్తీనాపై చేస్తున్న అమానవీయ దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని పాలస్తీనాపై ఇజ్రాయిల్ కొన్నేళ్ల నుంచి యుద్ధం చేస్తూ, వేల మంది ప్రాణాలను బలిగొందని విమర్శించారు. కనీస యుద్ధ నియమ, నిబంధనలను పాటించకుండా విచక్షణా రహితంగా బాంబుల వర్షం కురిపిస్తోందని, ముఖ్యంగా గాజాలోని పాఠశాలలు, వైద్యశాలలు, పౌర సముదాయాలు, రేషన్ దుకాణాలపై యుద్ధోన్మాదంతో దాడులు చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే సుమారు 56,000 మంది పాలస్తీనా పౌరులు చనిపోయినట్లు అంతర్జాతీయ సంస్థలు ప్రకటించాయని, అందులో సుమారు 20 వేల మంది పసిపిల్లలు ఉండడం బాధాకరమని పేర్కొన్నారు. ఆగస్టు 7న ఖమ్మం నగరంలో ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని తెలియజేస్తూ నిర్వహిస్తున్న ర్యాలీకి సీపీఎం సంఘీభావం తెలుపుతోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేశ్, వై.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటనపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. నిజాంపేటవాసి దాసరి రాజశేఖర్ (32) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఆయన మద్యానికి బానిసవడంతో భార్య ఏడాది కిందట పుట్టింటికి వెళ్లింది. కాగా, ఈ నెల 1న మద్యం మత్తులో ఎలుకల మందు తాగాడు. బంధువులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాజా మాజీ సర్పంచ్‌లకు ఫేక్ ఫోన్లు

నేలకొండపల్లి: మండలంలోని అజయ్‌తండా, భైరవునిపల్లి, చెరువుమాధారం గ్రామ పంచాయతీల తాజా మాజీ సర్పంచ్‌లకు ఆదివారం కొన్ని ఫేక్ కాల్స్ వచ్చాయి. వివరాలిలా ఉన్నాయి.. తాను హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ నుంచి మాట్లాడుతున్నానని.. మీ పంచాయతీకి సంబంధించి రావాల్సిన బకాయిలు చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామని, ఎంబీలు ఎన్ని ఉన్నాయి.. ఎవరి పేరు మీద ఉన్నాయి.. అన్నింటికీ బిల్లులు పెట్టారా? లేదా? అని ఆరా తీశాడు. దీంతో నిజమని నమ్మి సర్పంచ్‌లు వివరాలు చెప్పారు. డబ్బులు పంచాయతీ ఖాతాలో జమ చేయాలా? లేక మీ సొంత ఖాతాలో జమ చేయాలా? అంటూ అడిగాడు. అలాగే తాను చెప్పిన నంబర్‌కు రూ.3 వేలు పంపిస్తే మీ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని చెప్పడంతో వదిలేశారు. అలా అజయ్‌తండా సర్పంచ్ పార్వతి భర్త శంకర్‌కు, చెరువుమాధారం సర్పంచ్, భైరవునిపల్లి సర్పంచ్‌లకు ఫోన్‌లు రావడంతో వారు అనుమానం వచ్చి డబ్బులు పంపకుండా వదిలేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రభుత్వ భూముల పరిశీలన

నేలకొండపల్లి : దక్షిణ భారతదేశంలో కెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రాన్ని, దాని చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను అదనపు కలెక్టర్ శ్రీని వాసరెడ్డి పరిశీలించారు. భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకో వాలని రెవెన్యూ అధి కారులను ఆదేశించారు. దాదా పు ఐదెకరాల భూమిలో పార్కు ఏర్పాటుకు కార్యాచరణ రూ పొందించనున్నామని, కాటేజీల నిర్మాణానికి భూములకు కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. బౌద్ధక్షేత్రం పక్కనే ఉన్న చెరువు దగ్గర హరిత హోటల్ ఏర్పాటుకు అనుకూలంగా ఉందని గుర్తించారు. ఆయన వెంట పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, నేలకొండపల్లి తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ ఆలస్యం మధుసూదన్‌రావు ఉన్నారు.

కత్తితో మహిళను బెదిరించిన వ్యక్తి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం రాఘవయ్యనగర్‌లో ఓ వ్యక్తి కత్తితో మహిళను బెదిరింపులకు గురిచేశాడు. ఈ ఘటనపై ఆదివారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రాఘవయ్యనగర్‌కు చెందిన బి.జ్యోతి, అదేప్రాంతానికి చెందిన పి.శ్రీను మధ్య కొంతకాలంగా రాజకీయ విభేదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీను తన ఇంటి వద్దకు వచ్చి, కత్తిపట్టుకుని చంపేస్తానంటూ బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ భానుప్రకాష్ తెలిపారు.

ప్రాణాలు పణంగా పెట్టి అడ్డుకుంటాం



ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లిటౌన్: ఈ ప్రాంత నిర్వాసితులకు చెందిన లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వకుండా రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా ఇస్తే ప్రాణాలుపణంగా పెట్టి అయినా అడ్డుకుంటామని లారీ యజమానులు స్పష్టం చేశారు. సత్తుపల్లి సింగరేణి లారీ, టిప్పర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన సమావేశంలో సింగరేణి యాజమాన్యం తీరుపై మండిపడ్డారు. నాణ్యమైన బొగ్గును సమయానికి ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని దుయ్యబట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలను అతిక్రమిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి సత్తుపల్లి, కిష్టారం ఓసీల్లో ఉత్పత్తి అయిన బొగ్గులో 30 శాతం లోడింగ్ స్థానిక లారీలకు కల్పించాలని కోరారు. బొగ్గు లోడింగ్ లేకపోవటం వల్ల లారీ యజమానులకు పూటగడవటం కూడా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 600 లారీలు ఉంటే.. రోజుకు రెండు లారీలకు లోడింగ్ ఇవ్వటం సింగరేణి అధికారుల తీరుకు నిదర్శనమన్నారు. ఆంధ్రా కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తూ స్థానిక లారీలకు లోడింగ్ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండపల్లి రమేశ్‌రెడ్డి, చిన్నంశెట్టి సూరిబాబు, మౌలాలి, మునీర్, రమేశ్, పాలకుర్తి దాసు, పీఎల్ ప్రసాద్, కోట మోహన్‌రావు, కోటేశ్వరరెడ్డి, ఐ.శ్రీనివాసరావు, మారేశ్వరరావు పాల్గొన్నారు.

చెరువులో మునిగి రైతు మృతి



జగన్ మృతదేహం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలోని రామసముద్రం చెరువులో ప్రమాదవశాత్తు మునిగి గ్రామానికి చెందిన రైతు తోటకూరి జగన్ (35) ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగన్ గేదెలను మేతకోసం పొలానికి తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొస్తుండగా.. గేదెలు నీళ్ల కోసం రామసముద్రంలో చెరువులోకి దిగాయి. అవి బయటకు రాకపోవటంతో జగన్ చెరువులోకి దిగి, మునిగిపోయాడు. ఆయనకు ఈత రాకపోవటంతో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగుల్‌మీరా పరిశీలించి, మృతదేహాన్ని బయటకు తీయించి, ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రెడ్డిచెరువులో సోదరులు గల్లంతు?



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ నాగుల్‌మీరా

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన మత్స్యకారులు, సోదరులు కంభం నాగేశ్వరరావు, సత్యం రెడ్డిచెరువులో గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కంభం నాగేశ్వరరావు గ్రామంలోని రెడ్డిచెరువును లీజుకు తీసుకుని చేపల పెంపకం చేపట్టాడు. రోజూ మాదిరిగానే తన తమ్ముడు సత్యంతో కలిసి ద్విచక్ర వాహనంపై చెరువు వద్దకు వెళ్లారు. చీకటి పడినప్పటికీ వారు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ రావటంతో ఆందోళనతో చెరువు వద్దకు వెళ్లారు. చెరువు కట్టపై ద్విచక్ర వాహనం, దుస్తులు, చెప్పులు విడిచి ఉండటాన్ని గుర్తించి గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగుల్ మీరా చెరువు వద్దకు చేరుకుని స్థానికుల సహకారంతో నాటు పడవల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. రాత్రి సమయం కావటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

ఖమ్మంక్రైం: రైలుకింద పడి గుర్తుతెలియని వృద్ధురాలు (70) మృతిచెందిన ఘటనపై ఖమ్మం జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. సారథినగర్ ప్రాంతంలో రైలుకింద పడి వృద్ధురాలు మృతిచెందింది. మృతదేహాన్ని పోలీసులు గుర్తించి, ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి వద్ద వరంగల్ నుంచి విజయవాడకు, గుంటూరు నుంచి వరంగల్‌కు తీసుకున్న టిక్కెట్లు లభించాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళగా భావిస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మధిర పట్టణంలో చోరీ



ఇంటి తలుపు తాళం పగలగొట్టిన దృశ్యం

మధిర: పట్టణంలోని నందిగామ బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరుకూరి నాగార్జున శనివారం హైదరాబాద్ వెళ్లగా ఆయన సతీమణి లక్ష్మి ఎన్టీఆర్‌జిల్లా వత్సవాయి మండలం మక్కపేటలోని పుట్టింటికి వెళ్లింది. గుర్తుతెలియని దుండగులు అదే రోజు రాత్రి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.1.20 లక్షల నగదు, 4 బంగారు గాజులు, నల్లపూసల గొలుసు చోరీచేశారని, సుమారు రూ.9లక్షల సొత్తును అపహరించినట్లు బాధితుడు తెలిపారు. మరో గది తలుపు గడియ పగలగొట్టి దుస్తులు, వస్తువులను చిందరవందర చేశారు. ఘటనా స్థలాన్ని టౌన్ ఎస్‌హెచ్‌ఓ రమేశ్‌తో పాటు ఖమ్మం నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నేలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ, గ్రామదీపికకు గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. కోనాయిగూడెం గ్రామానికి చెందిన గ్రామదీపిక, మాజీ ఎంపీటీసీ కొమ్మినేని పుష్పావతి స్కూటీపై వెళ్తుండగా గేదెలు అడ్డు వచ్చాయి. ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఆమె కిందపడి గాయపడింది. ఆమెను మాజీ సర్పంచ్‌లు పెంటమళ్ల పుల్లమ్మ, తురక పాపయ్యతోపాటు వడ్లమూడి నర్సయ్య తదితరులు పరామర్శించారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

ఖమ్మంక్రైం: నగరంలోని రంగనాయకుల గుట్టలో ఆదివారం పోలీసులు తనిఖీలు చేసి, గంజాయి కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం.. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్న బుర్రి మల్లికార్జున్‌రావు ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెచ్చి, నగరంలోని సంపత్, మదన్‌కు విక్రయించాడు. కాగా, మల్లికార్జున్ పారిపోగా వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని, రూ.50 వేల విలువైన కిలో గంజాయి, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు.

మల్చింగ్ సాగు.. బాగు



నేలపై పరిచిన మల్చింగ్, (ఇన్‌సెట్) మల్చింగ్ విధానంలో బొప్పాయిసాగు

- కలుపు, చీడపీడల సమస్యకు చెక్
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఆసక్తి చూపుతున్న ఏజెన్సీ రైతులు

ఇల్లెందురూరల్: రైతులు సాగు చేసిన పంటలపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపిస్తుంటాయి. దీనికి తోడు తెగుళ్లు, చీడపీడల బెడద వంటి పలు కారణాలతో దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా చేతికందక నష్టపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు క్రమంగా సాంకేతిక సాగు పద్ధతులు అవలంబిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఘడించేలా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. విపత్తులను తట్టుకుంటూ చీడపీడలు, కలుపు నియంత్రిస్తూ, తక్కువ మోతాదులో నీటి తడులతో ఆశించిన దిగుబడులు అందించే మల్చింగ్ సాగు విధానంపై రైతులు దృష్టిసారిస్తున్నారు.

షీట్ల ఎంపిక ఇలా..

ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూల మొక్కల సాగులో మల్చింగ్ షీట్లను అధికంగా ఉపయోగిస్తారు. 3 నుంచి 4 నెలల కాలవ్యవధి ఉండే పంటల సాగులో 50 మైక్రాన్ల మల్చింగ్ షీట్లను ఉపయోగిస్తారు. 12 నుంచి 15 నెలల కాల వ్యవధి కలిగిన పంటల సాగులో 100 షీట్లను వాడటం మేలు. 7.25 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు ఒక పంట కాలానికి, 50 నుంచి 200 మైక్రాన్ల మందం కలిగిన షీట్లు మూడేళ్ల వరకు మన్నిక కలిగి ఉంటాయి.

సాగు విధానం..

మల్చింగ్ పరిచే విధానం పలు రూపాలలో ఉంటుంది. విత్తనం వేయక ముందు, వేసిన తరువాత కూడా మల్చింగ్ షీట్లను కప్పేందుకు అవకాశం ఉంటుంది.

- మొక్క పాదుకు సరిపడా షీట్‌ను కత్తిరించి మధ్యలో గుండ్రంగా మొక్క కాండానికి సరిపడా రంధ్రం చేసి బయటకు చీలిక చేయాలి.
- చీలిక గుండా కాండం మధ్యలోకి వచ్చేలా తొడిగి మట్టితో షీట్ అంచులు కప్పడంతో పాటు మూడు, నాలుగు అర్ధచంద్రాకారంలో రంధ్రాలు చేస్తే భూమిలోకి నీరు ఇంకుతుంది.
- కూరగాయల పంటల్లో విత్తనాలు విత్తేముందు మొక్క మధ్యలో వరుసల మధ్య ఉన్న దూరాన్ని బట్టి ముందే షీట్‌కు రంధ్రాలు చేయాలి.
- షీట్‌ను నాగలి సాలు మీద పరిచి రెండు వైపులా కొనలపై మట్టి ఎగదోస్తే కవర్లు కొట్టుకుపోకుండా ఉంటాయి. ఆతర్వాత రంధ్రాల్లో 2 నుంచి 3 విత్తనాలు వేసి మట్టి కప్పాలి.
- విత్తనాలు మొలిచాక మొక్క చుట్టూ షీట్‌ను తగిన సైజులో కత్తిరించి ప్రతి మొక్క మొదటలో వచ్చేలా తొడగాలి.
- ఈ షీట్‌ను ప్రతీ వరుసలో లేదా చెట్టు దగ్గర మరీ వదులుగా లేదా బిగుతుగా లేకుండా కప్పి అన్ని చివరలకు గాడిలో పోయేలా చేసి మట్టితో కప్పాలి. దీనివల్ల మల్చింగ్ షీటు గాలికి చెదిరిపోకుండా ఉంటుంది.

ప్రయోజనాలిలా..

భూమిపై ప్లాస్టిక్ షీట్ కప్పి బయటి వాతావరణానికి సంబంధం లేకుండా నేలలోని ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరిస్తుంది. సూర్యకిరణాలను మొక్క ప్రతి భాగానికి అందించి అనుకూలమైన పరిస్థితులను ఏర్పర్చడానికి వీలు కలుగుతుంది. కలుపు నివారణ 80 శాతం తగ్గుతుంది. 50శాతం వరకు సాగునీటి ఆదాతో పాటు తెగుళ్ల నివారణకు దోహదపడుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో సాగుచేసే రైతులకు ప్రయోజనం చేకూర్చుతుంది.

నీటి తడులు పరిమితంగా..



గతేడాది మల్చింగ్ విధానంలో టమాట సాగు ప్రారంభించాను. చేనులో కలుపు బాధ కనిపించలేదు. చీడపీడలు కూడా తక్కువే. నీటి తడులు పరిమితంగానే సరిపోయాయి. ఆశించిన దిగుబడి రావడంతో ఈ ఏడాది కాకర, బీర సాగులోనూ మల్చింగ్ విధానం ఉపయోగించాం.

– బాలు, రైతు, కొమరారం

కలుపు బెడద తీరింది



ఇప్పటివరకు మిర్చి, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేశాను. ఈఏడాది మూడు ఎకరాల్లో బొప్పాయి సాగు ప్రారంభించాను. మల్చింగ్ విధానంలో మొక్కలు నాటాను. ఇప్పటి వరకు కలుపు నివారణ, నీటి తడులకు పెద్దగా శ్రమ పడలేదు. మొక్కలు ఆశాజనకంగా పెరుగుతున్నాయి.

– సంతు, రైతు, బోయితండా

అవగాహన కల్పిస్తున్నాం..



రైతులు సంప్రదాయ సాగు కంటే శాస్త్రీయ పద్ధతులు అవలంబించి మంచి దిగుబడులు సాధించాలని అవగాహన కల్పిస్తున్నాం. మల్చింగ్ సాగు బహుళ ప్రయోజనాలను అందిస్తోంది. ప్రధానంగా కలుపు నివారణకు మల్చింగ్ ఉపయోగపడుతుంది.

– సతీష్, ఏఓ